2023 నూతన సంవత్సర శుభాకాంక్షలు

నూతన సంవత్సర వేడుకలు



భూపాలపల్లి అర్బన్: కేక్ కట్ చేస్తున్న సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు మాధవి, సభ్యులు



మల్హర్: కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

భూపాలపల్లి అర్బన్/గణపురం: జిల్లా కేంద్రంతో పాటు గణపురం మండలంలో శనివారం ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున సంబురాల్లో పాల్గొని కేక్ కట్ చేశారు.

మల్హర్: మండలంలోని తాడిచర్లలోని సాయివాణి విద్యానికేతన్ ప్రైవేట్, వల్లెకుంట దేవి విద్యోదయ పాఠశాలల్లో, తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది ముందస్తు నూతన సంవత్సర వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముగ్గులు వేసి, ఆట, పాటలతో అలరించారు. ఉపాధ్యాయులు సుమాంజలి, నాగరాణి, ధర్మలత, లక్ష్మి, కొమల ఉన్నారు.



భూపాలపల్లి అర్బన్: వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



భూపాలపల్లి అర్బన్: చిన్నారుల కేరింతలు

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

భూపాలపల్లి అర్బన్: జిల్లా బార్ అసోసియేషన్ 2023 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ శనివారం ఆవిష్కరించారు. జిల్లా కోర్టు ఆవరణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసచారి ఆధ్వర్యంలో జిల్లా ప్ర ధాన న్యాయమూర్తి నారాయణబాబు ఆవిష్కరించారు. జూనియర్ జడ్జి రాంచంద్రరావు, న్యాయవాదులు రవీందర్, ప్రియాంక, వెంకటస్వామి, రమేష్, కవిత, మోహినోద్దీ, రమేష్, రాకేష్ పాల్గొన్నారు.



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జడ్జి, న్యాయవాదులు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇబ్బందులు

మహదేవపూర్: ప్రభుత్వ ప్రాజెక్టు పనులకు ఇసుక పంపించడానికి ఏర్పాటు చేసిన మండలంలోని మాదాపూర్‌లో గల ఇసుక క్వారీ–2 కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇబ్బందులు పడుతున్నామని భూములు లీజ్‌కు ఇచ్చిన రైతులు వాపోతున్నారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగు సంవత్సరాల కాలంగా లీజుకు తీసుకున్న భూముల రైతులకు కవులు డబ్బులు చెల్లించకుండా అక్రమంగా భూములలో ఇసుక పోసి పంటలు వేసుకోకుండా కాంట్రాక్టర్ ముఖం చాటేస్తున్నాడని ఆరోపించారు. వెంటనే కౌలు రైతులకు డబ్బులు చెల్లించాలని కోరుతున్నారు.

ఆర్థికసాయం

మహాముత్తారం: మండలానికి చెందిన మహేష్ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పోలీస్ ఈవెంట్స్‌లో పాల్గొని అస్వస్థతకు గురై మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీజేపీ మండల నాయకులు శనివారం పరామర్శించారు. రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.5వేలు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. బీజేపీ మండలాధ్యక్షుడు సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శివ, కిసాన్ మోర్చ అధ్యక్షుడు పోచన్న ఉన్నారు.

కాస్తులో ఉన్న వారికి పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న మల్లేష్

చిట్యాల: మండలంలోని నైనాపాక శివారులో గల ప్రభుత్వ భూముల్లో కాస్తులో ఉన్న వారికి పట్టాలు అందించాలని సీపీఎం ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారెపల్లి మల్లేష్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వే నంబర్లు 440, 442, 443లో సాగులో ఉన్న వారిని గుర్తించి నిరుపేదలకు తక్షణమే పట్టాలు ఇవ్వాలని కోరారు. సర్వేలు జరపకుండా నిరుపేదలకు పట్టాలందకుండా అధికార పార్టీకి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు అడ్డుకోవడం సరైంది కాదని అన్నారు. భూమి లేని నిరుపేదలకు భూములు అందజేస్తామని చెబుతున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని అన్నారు. ఆ భూమిలో సాగులో ఉన్న వారందరికీ పట్టాలు ఇవ్వకుంటే నిరుపేదలను ఏకం చేసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అణగారిన వర్గాల అభివృద్ధే లక్ష్యం

కాటారం: భవిష్యత్ రోజుల్లో తెలంగాణలోని మూడు కోట్ల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ అణగారిన వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు దళిత శక్తి ప్రోగ్రాం(డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. విశారదన్ మహారాజ్ చేపట్టిన పదివేల కిలో మీటర్ల స్వరాజ్య పాదయాత్ర శనివారం కాటారం గంగారం క్రాస్ రోడ్డు, బూడిదపల్లి, దేవరాంపల్లి, శంకరాంపల్లి క్రాస్ మీదుగా మండల కేంద్రానికి చేరుకుంది. పాదయాత్రలో భాగంగా ఆయా గ్రామాల్లో మహిళలు, యువత, ప్రజలు విశారదన్‌కు మంగళహారతులతో స్వాగతం పలికారు. పలు గ్రామాల్లో డీఎస్పీ జెండాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశారదన్ మాట్లాడుతూ డీఎస్పీ జెండా భారత రాజ్యాంగాన్ని రక్షిస్తూ అణగారిన వర్గాల ప్రజలకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్, బీసీ సంక్షేమ సంఘం మంథని ఇన్‌చార్జ్ దుర్కి కుమార్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



బూడిదపల్లిలో మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

4న జిల్లా స్థాయి పోటీలు

భూపాలపల్లి అర్బన్: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన జిల్లా స్థాయి యువజన పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారిణి సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన యువతలోని నైపుణ్యాలను, సాహిత్య పాటవాలను వెలికి తీసేందుకు జానపద గేయాలు, జానపద నృత్యాలు, ఉపన్యాస పోటీలు హిందీ, ఇంగ్లిష్ భాషలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రూప్ డ్యాన్స్‌లో 20 మంది, ఫోక్ సాంగ్ డ్యాన్స్‌లో 10 మంది కలిసి అవకాశం ఉంటుందన్నారు. ఈ పోటీల్లోనే వారు 3వ తేదీలోపు జిల్లా యువజనశాఖ కార్యాలయంలో లేదా 8328577652 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరు



మహదేవపూర్: అరెస్టు అయిన నాయకులు

మహదేవపూర్: అక్రమ అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు ప్రణయ్ అన్నారు. ప్రగతి భవన్ ముట్టడికి వెళ్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులను మండల పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని అన్నారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రణయ్, వార్డ్ మెంబర్ రవి చందర్, అస్రార్కు రేసి, కృష్ణమోహన్, అశోక్, ముభీద్, అరెస్టు అయిన వారిలో ఉన్నారు.

మల్హర్‌లో..

మల్హర్: యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి పిలుపు మేరకు చలో ప్రగతి భవన్ ముట్టడికి వెళ్తున్న యువజన నాయకులను శనివారం కొయ్యూరు పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో సవేందర్, మల్లారెడ్డి, వేల్పుల మహేందర్, మల్లేష్, నవీన్, సలాదితో పాటు తదితరులు ఉన్నారు.

బైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలి



కాటారం: ఆందోళన చేస్తున్న అయ్యప్ప మాలధారులు, భక్తులు



కొయ్యూరులో..

భూపాలపల్లి అర్బన్/ భూపాలపల్లి రూరల్/ కాటారం/ మల్హర్: అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలని అయ్యప్ప భక్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా అయ్యప్ప మాలధారులు, బీజేపీ నాయకులు, భక్తులు, హిందూవాదులు శనివారం రస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వామిపై అనిచుత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. హిందువుల జోలికి వస్తే తగిన గుణపాఠం చెబుతామని, తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం పలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



భూపాలపల్లి అర్బన్: నిరసన వ్యక్తం చేస్తున్న అయ్యప్ప మాలధారులు

చాక్‌పీస్‌లతో శుభాకాంక్షలు



చాక్‌పీస్‌లతో రూపొందించిన హ్యాపీ న్యూ ఇయర్

కాటారం: సాధారణంగ చిత్రాలను దింపడమే ఓ అరుదైన కళ. అలాంటిది సూక్ష్మ చిత్రకళతో ఆకట్టుకుంటున్నాడు ఓ చిత్రకారుడు. సుద్దముక్క, సబ్బుబిళ్లలపై అరుదైన ఆకృతులను గీస్తూ తన ప్రతిభను చాటుకుంటున్నాడు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో చిత్రకళ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆడెపు రజనీకాంత్. నేడు(ఆదివారం) నూతన సంవత్సర ప్రారంభాన్ని పురస్కరించుకొని రజనీకాంత్ చాక్‌పీస్ ముక్కలతో హ్యాపీ న్యూ ఇయర్ 2023 అనే అక్షరాలతో కూడిన ఆకృతిని రూపొందించారు. 1.5 సెంటీమీటర్ల ఎత్తు, 1 సెంటీమీటర్ వెడల్పు కలిగిన చాక్‌పీస్ ముక్కలతో ఆకృతిని చిత్రీకరించారు.

'ప్రేమ్‌సాగర్‌రావు క్షమాపణ చెప్పాలి'

భూపాలపల్లి రూరల్: మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో నేతకాని మహర్ దళిత సంఘాల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంఘాల కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గోమాసే నిర్వహిస్తున్న రోడ్ షోను అడ్డుకునే ప్రయత్నం చేసిన మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు క్షమాపణ చెప్పాలని తెలంగాణ భీం సైనిక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు జువ్వాజితిరుపతి డిమాండ్‌చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అంతర్గాం రాజమౌళి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్‌షోలకు వస్తున్న మద్దతును ఓర్వలేని మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు రౌడి మూకలతో అడ్డుకునే ప్రయత్నంచేశారని ఆరోపించారు. గోమాసభూమయ్య, రమేష్, భిక్షపతి, బాపు, పోషం, తదితర విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతుల కోసమే భవన నిర్మాణాలు

మహాముత్తారం: రైతుల సౌకర్యం కోసమే పీఏసీఎస్ భవనాలను నిర్మాణం చేపడుతున్నామని చైర్మన్ సోమ శాంతకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంత మంది నిర్మాణాలను అడ్డుకోవాలని చూస్తున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్లు అల్లాఉద్దిన్, అజ్మీరా సుజాత, రాజయ్య, వేల్పుల సమ్మక్క, మల్లక్క పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

కాటారం: కాటారం మండలం ఒడిపిలవంచకు చెందిన పలు పార్టీల కార్యకర్తలు శుక్రవారం రాత్రి బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. నూతనంగా పార్టీలో చేరిన వారికి సునీల్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం, రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొమ్మన భాస్కర్‌రెడ్డి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఉడుముల విజయారెడ్డి, జిల్లా కోశాధికారి దుర్గం తిరుపతి, గంట అంకయ్య, సకినారం శ్రీహరి, శ్రీవాణి, శ్రీశైలం పాల్గొన్నారు.

నాయకపోడు మండల కమిటీ ఎన్నిక

మల్హర్: నాయకపోడు సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టం భూమయ్య ఆధ్వర్యంలో మండలంలోని కొయ్యూరు నాగులమ్మ వద్ద మండల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గుంటి రామచంద్రం, అధ్యక్షుడిగా లక్ష్మినారాయణ, ఉపాధ్యక్షులుగా పెద్ది కొమురయ్య, ముంజ శంకర్, ప్రధాన కార్యదర్శిగా గుంటి శ్రీను, సహాయ కార్యదర్శిగా కొట శ్యామ్, కోశాధికారిగా గాదె రమేష్, ప్రచార కార్యదర్శిగా అరవెండి మహేందర్, సలహాదారుడిగా ఊరవెద్ది వంశీ, సంస్కృతిక శాఖ కార్యదర్శిగా పెరుమాండ్ల సడువలి, వర్కింగ్ ప్రసిడెంట్‌గా తోట సతీష్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

తప్పిపోయిన మహిళ ఆచూకీ లభ్యం



లక్ష్మిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

టేకుమట్ల(రేగొండ): తప్పిపోయిన మహిళ ఆచూకి తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన మండలంలోని కాకర్లపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం రేగొండ మండలంలోని కాకర్లపల్లి గ్రామానికి చెందిన ఒరంగంటి లక్ష్మి అనే మహిళ కూలీ పనులకు వెళ్తున్నానని చెప్పి శుక్రవారం వెళ్లి సాయంత్రమైనా తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో శనివారం రేగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై జిల్లాని అన్ని మండలాల్లో సిబ్బందిని అలెర్ట్ చేయగా భూపాలపల్లి మండలంలోని గుడాడ్‌పల్లిలో మహిళను గుర్తించి, సాయంత్రం లక్ష్మిని ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా ప్రత్యేక చొరవతో లక్ష్మిని ఇంటికి చేర్చినందుకు ఎస్సైకి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

చిట్యాల: మండలంలోని కాల్వపల్లి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జడల్‌పేట గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నేరేడుపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ మేకల స్టాలిన్, ఓనర్ బండి సునీల్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది సిద్దార్థ(సిద్దు), లాల్‌సింగ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

మహాముత్తారం: మండలంలోని వజినేపల్లికి చెందిన ఇద్దరిపై కేసు నమోదు అయినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వజినేపల్లి గ్రామానికి చెందిన మారుపాక సమ్మక్కను అదే గ్రామానికి చెందిన ఇరుకు సమ్మక్క, రజిత అనే ఇద్దరు మహిళలు గొడవపడి గాయపర్చారు. ఈమేరకు శనివారం మారుపాక సమ్మక్క పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహనాల తనిఖీ

మహదేవపూర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఎస్సై రాజకుమార్ ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రంకన్‌డ్రైవ్ పరీక్షలు చేశారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి డ్రంకెన్ డ్రవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎస్సై హెచ్చరించారు.

బస్సు కిందపడి వ్యక్తి మృతి

మణుగూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రమాదం

మణుగూరు రూరల్ : ప్రమాదవశాత్తు బస్సు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన భద్రాద్రి జిల్లా మణుగూరులో సురక్షా(ఆర్టీసీ) బస్టాండ్ ప్రాంగణంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. భూపాలపల్లికి చెందిన జీదుల రాజ్‌కుమార్ తన బంధువులను పలకరించేందుకు మణుగూరు వచ్చాడు. ఇంటికి తిరిగి వెళ్లేందుకు సురక్షా బస్టాండ్ చేరుకున్నాడు. బస్టాండ్‌లో బస్సు ఎక్కే క్రమంలో సీటు ఆపుకునేందుకు కిటికీలో నుంచి రుమాల్‌ను సీటులో వేసే క్రమంలో ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. బస్సు ఒక్కసారిగా ముందుకు కదలడంతో టైర్ల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మణుగూరు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.